# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 03-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైల్వే బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్‌కు 10 వేల 134 కోట్ల రూపాయలు కేటాయించామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.**

2. **కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

3. **నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన రావి నారాయణరెడ్డి పోరాటం నేటికీ స్ఫూర్తినిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**

4. **జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు పంపిణీ చేయనుంది.**

==========================

రైల్వే బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్‌కు 10 వేల 134 కోట్ల రూపాయలు కేటాయించామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రైల్వే బడ్జెట్‌లో వివిధ రాష్ట్రాలకు నిధులు మంజూరుపై ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలంగాణలో రైల్వే అభివృద్ధి పనులకు 5 వేల 454 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. హైస్పీడ్ రైల్వే కారిడార్‌తో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు మధ్య ఆర్థిక, ఆరోగ్య పర్యాటకం అభివృద్ధి చెందుతుందని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. పోలవరం, అమరావతి నిర్మాణాలకు,విశాఖపట్నం అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నుండి నిధులు రానున్నాయని చెప్పారు. అరుదైన భూ ఖనిజాల కారిడార్ రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన రావి నారాయణరెడ్డి పోరాటం నేటికీ స్ఫూర్తినిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు.అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ముఖ్యమంత్రి నిన్న ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, నారాయణరెడ్డి... రాచరిక పోకడలు, అణిచివేత చర్యలపై పోరాడారని 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ బృందం లండన్ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ గిన్ రిచర్డ్స్‌తో (gywn richards) మంత్రి సమావేశమైయ్యారు. లండన్ నగరం మాస్టర్ ప్లాన్, అభివృద్ధి ప్రణాళికలు, రవాణా సౌకర్యాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గిన్ రిచర్డ్స్ మంత్రికి వివరించారు. లండన్ నమునా ద్వారా నగర నిర్మాణం గురించి తెలియజేశారు. అలాగే లండన్ లో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దిన బాటర్సీ పవర్ స్టేషన్ ను మంత్రి బృందం పరిశీలించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నూజివీడు నియోజకవర్గంలో ముసునూరు మండలం కొర్లగుంట గ్రామంలో నిర్వహించిన "మీ భూమి – మీ హక్కు" కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యూ ఆర్ కోడ్ తో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కొలుసు పార్థసారథి మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు పంపిణీ చేయనుంది. గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ప్రారంభ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, మంత్రి నాందెడ్ల మనోహర్ పాల్గొంటారు. ఎంపికచేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆరేళ్ల నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు గత 2025వ సంవత్సరం జులై నుంచి నవంబరు వరకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 94,689 మందికి కంటి అద్దాలు అవసరమని వైద్యాధికారులు గుర్తించారు. ఇందుకు అనుగుణంగా కంటి అద్దాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని అధికారులు తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర బడ్జెట్ ఉందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆమె నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, హైస్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటులో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యం కల్పించారని పేర్కొన్నారు.

వాయిస్..30 సెకన్లు

---------------------------

సింగరేణి సంస్థకు తాడిచెర్ల 2 వ బొగ్గుగనిని కేటాయించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదన పంపితే ఆ అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర బొగ్గుగనుల శాఖ సహాయమంత్రి సతీశ్‌చంద్ర దూబే తెలిపారు.

రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 'తాడిచెర్ల బొగ్గుగని-2 అంశంపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలూ రాలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే నీతిఆయోగ్ సిఫార్సుల ఆధారంగా పరిశీలించి తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

---------------------------

దివ్యాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీలో నాణ్యమైన సేవలందేలా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి నిర్వహిస్తున్న "జనతా వారధి"కి దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఎదురువుతున్న సమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం జారీచేసే ధ్రువపత్రం కోసం దివ్యాంగులు సచివాలయం, ప్రభుత్వాసుపత్రి, జిల్లా వైద్య బోర్డు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. మండల స్థాయిలో వైద్య బోర్డు శిబిరాలు నిర్వహించి, తీవ్ర వైకల్యంతో బాధపడుతున్నవారి ఇళ్లకే వెళ్లి పరీక్షలు నిర్వహించి, ధ్రువీకరణ పత్రాల జారీ సులభతరం చేయాలని కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. రాత్రి సమయంలో చలి గాలుల తీవ్రత కొనసాగుతోంది. ఉదయం సమయంలో పొగమంచు అధికంగా ఉంటుందని, వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

ఇక మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా జిమాడుగులలో 6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలోని ఆదిలాబాద్‌లో 13.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

======================